క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన సీఐలు



ఎమ్మెల్యేకు మొక్కలు ఇస్తున్న సీఐలు

జగిత్యాలరూరల్: జగిత్యాల పట్టణ సీఐ, రూరల్ సీఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కరుణాకర్, సుధాకర్ గురువారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. పట్టణ సీఐ ఎస్పీ అశోక్‌కుమార్‌ను కూడా కలిశారు.

విద్యుత్ స్తంభాల ట్యాక్స్ రద్దు చేయాలి

జగిత్యాల: కేబుల్ ఆపరేటర్ల నుంచి విద్యుత్ శాఖ వారు గ్రామపంచాయతీస్థాయిలో రూ.15, మున్సిపాలిటీలో రూ.20 ప్రతినెల కరెంట్ బిల్లుల్లో వసూలు చేస్తున్నారని, రద్దు చేసేలా చూడాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు నియోజకవర్గానికి కేబుల్ ఆపరేటర్లు కలిసి కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 ఏళ్లుగా కేబుల్ టీవీ నిర్వహించుకుంటున్నామని, గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు వినోదాన్ని అందిస్తున్నామని, మాపై విద్యుత్ శాఖ ట్యాక్స్‌లు వేయడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

విద్యార్థులు, టీచర్లకు ఇబ్బంది లేకుండా చర్యలు



టీచర్లతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

సారంగాపూర్: విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. సారంగాపూర్ కేజీబీవీ, సాంఘీక సంక్షేమ వసతి గృహాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను, వసతి గృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఏమైన మరమ్మత్తులు ఉంటే వెంటనే చేపట్టాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీవో చౌడారపు గంగాధర్, కేజీబీవీ ప్రత్యేకాధికారి వీణ, వార్డెన్ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

చిన్న పిల్లలకు బొమ్మలతో బోధించాలి



మాట్లాడుతున్న డీడబ్ల్యూవో నరేశ్

ఇబ్రహీంపట్నం: అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్న పిల్లలకు బొమ్మల ద్వారా భోదిస్తే సులభంగా అర్థమవుతుందని డీడబ్ల్యూవో నరేశ్ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3 ఏళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకే పంపించాలని, ప్రయివేటు పాఠశాలలకు పంపించవద్దని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీడీపీవో మణెమ్మ, సూపర్‌వైజర్ శోభారాణి, అంగన్‌వాడీ టీచర్లు భాగ్యలక్ష్మి, ఇందిర, రాధ, రాజకళ, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

సరస్వతీ ఆలయం ప్రారంభం



ఆలయాన్ని ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

సారంగాపూర్: మండలంలోని కోనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శ్రీ సరస్వతి అమ్మవారి ఆలయాన్ని పాఠశాల పూర్వవిద్యార్థులు, యువకులు గురువారం ప్రారంభించారు. పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన పూర్వ విద్యార్థులు, గ్రామయువకులు కలిసి రూ. 1.50 లక్ష వరకు వెచ్చించి అమ్మవారి ఆలయాన్ని నిర్మించి, విగ్రహం ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు మానేరు శంకరయ్య, గోవర్ధన్ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సరస్వతీ ఆలయ వార్షికోత్సవం

మల్యాల: మండలం నూకపల్లిలోని శ్రీ జ్ఞాన ధ్యాన విజ్ఞాన సరస్వతీ ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ గ్రామాల నుండి భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు.

పోచమ్మతల్లి బోనాలు



తాట్లవాయిలో బోనాలతో వస్తున్న మహిళలు



పెగడపల్లిలో పోచమ్మ బోనాలతో తరలివెళ్తున్న యాదవ మహిళలు

రాయికల్: మండలంలోని తాట్లవాయి, మూటపల్లి గ్రామాల్లో గురువారం పోచమ్మతల్లికి బోనాలు చేశారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

పెగడపల్లి: మండల కేంద్రంలో యాదవుల (గొల్ల) ఆధ్వర్యంలో బీరప్ప జాతర ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. గురువారం యాదవ మహిళలు ఇంటికో బోనం చొప్పున ఎత్తుకుని పోచమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. బీరప్ప జాతర ఉత్సవాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. యాదవులు, కుల పెద్దలు పాల్గొన్నారు.

మోరపల్లిలో పెద్దమ్మతల్లి తాతమ్మ జాతర

జగిత్యాలరూరల్: మండలంలోని మోరపల్లిలో గురువారం పెద్దమ్మతల్లి తాతమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. సింగిల్ విండో చైర్మన్ మహిపాల్‌రెడ్డి, గ్రామ ప్రత్యేకాధికారి డాక్టర్ నరేశ్, నాయకులు పాల్గొన్నారు.



బోనంతో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బోనమెత్తిన ఎమ్మెల్యే మేడిపల్లి

కొడిమ్యాల: మండల కేంద్రంలో తూర్పు పడమటి రెడ్డి సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన పోచమ్మతల్లి బోనాల్లో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొని బోనమెత్తుకున్నారు. మహిళలు బోనాలతో తరలివెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాజనర్సింగరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ గడ్డం జీవన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



పోచమ్మ ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు, వీడీసీ సభ్యులు

పోచమ్మ తల్లికి పూజలు

మల్లాపూర్: మల్లాపూర్ మండల కేంద్రంలో గురువారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలు గ్రామస్తులను అలరించాయి. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ సంగ గంగరాజం, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మద్దులపల్లి పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయుల స్వాగతం



రాఘవపేట హైస్కూల్‌లో విద్యార్థులతో కేక్ కట్ చేయిస్తున్న ఎంఈవో

మోగిన బడిగంట.. తెరుచుకున్న పాఠశాలలు

కోరుట్ల రూరల్/ధర్మపురి/రాయికల్/మల్లాపూర్/పెగడపల్లి/కథలాపూర్/సారంగాపూర్/ఇబ్రహీంపట్నం/మల్యాల: వేసవి సెలవులు ముగియడంతో గురువారం పాఠశాలలు ప్రారంభమయ్యాయి. సెలవుల్లో హాయిగా, ఆనందంగా గడిపిన విద్యార్థులు బ్యాగులు భుజాన వేసుకుని బడిబాట పట్టారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు బడి గేట్ వద్ద వేచి ఉండి విద్యార్థులకు స్వాగతం పలికారు.పలు పాఠశాలల్లో విద్యార్థులకు నోట్స్ బుక్స్, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు చేపట్టిన బడిబాటతో విద్యార్థులు అడ్మిషన్లు తీసుకోగా, పలు పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. కార్యక్రమాల్లో ఎంఈవోలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.



యూసుఫ్‌నగర్‌లో యూనిఫామ్స్ పంపిణీ



ముత్యంపేట లో విద్యార్థులకు పూలతో స్వాగతం



కొమటి కొండాపూర్‌లో పాఠ్యపుస్తకాలు పంపిణీ



బూరుగుపల్లెలో పునః ప్రారంభానికి పాఠశాల ముస్తాబు



సారంగాపూర్‌లో విద్యార్థులకు స్వాగతం



కథలాపూర్‌లో విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ

యావర్‌రోడ్డు విస్తరించాలి

జగిత్యాలటౌన్: జగిత్యాల మున్సిపాలిటీకి ప్రభుత్వం కేటాయించిన రూ.50కోట్లతో యావర్‌రోడ్డు విస్తరించేలా కలెక్టర్ చొరవ చూపాలని మాజీమంత్రి జీవన్‌రెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. యావర్‌రోడ్డు విస్తరణలో స్థలాలు కోల్పోయే వారికి నిధులు విడుదల చేయాలని 29 జూన్ 2024లో సీఎంకు లేఖ రాశానని, స్పందించిన సీఎం రోడ్డు విస్తరణకు నివేదిక ఇవ్వాలని కోరగా.. మిషన్ కాపౌండ్ నుంచి కొత్త బస్టాండ్ వరకు రూ. వంద కోట్లు అవసరమని గతేడాది డిసెంబర్‌లో డైరెక్టర్ ఆఫ్ మున్సిపాలిటీ ద్వారా నివేదించనన్నారు. ఇందులో భాగంగా రూ.50కోట్లు విడుదలయ్యాయన్నారు. డబుల్ ఇళ్ల విషయంలో ప్రచార ఆర్భాటం తప్ప పనులు జరగడం లేదని, రెండేళ్ల క్రితం 3500మంది లబ్ధిదారులను ఎంపిక చేసి పట్టాలు ఇవ్వాల్సి ఉండగా.. 25శాతం మందిని కూడా తరలించలేదన్నారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త మోహన్, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, కల్లెపెల్లి దుర్గయ్య, గాజుల రాజేందర్, చందారాధాకిషన్,మధు ఉన్నారు.



మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

ట్రాఫిక్ నియమాలపై అవగాహన తప్పనిసరి

జగిత్యాలరూరల్: పాఠశాల స్థాయి నుంచే ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో గురువారం పోలీసు పాఠశాల యువ పౌరుల కోసం రోడ్డు భద్రత కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పిల్లలు మన భవిష్యత్తు అని, వారికి ఇప్పుడు సరైన అవగాహన కల్పిస్తేనే రేపటి సమాజం మరింత భద్రమవుతుందనే ఉద్దేశంతో పోలీస్ పాఠశాల యువ పౌరుల కోసం రోడ్డు భద్రత కార్యక్రమంలో విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ సీఐ కరుణాకర్, ఐటీ కోర్ సీఐ రఫీక్ ఖాన్, ట్రాఫిక్ ఎస్సై మల్లేశం, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే

జగిత్యాలక్రైం: మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకెళ్లడం తప్పదని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మాట్లాడారు. గడిచిన 5 నెలల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 3200 మంది వ్యక్తులు పట్టుబడగా, వారికి కోర్టు ద్వారా జరిమానా విధించినట్లు తెలిపారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమైతే సెక్షన్ 304–2 కింద కేసులు నమోదు చేస్తామన్నారు.

బీజేపీతోనే సుస్థిరాభివృద్ధి

బుగ్గారం: బీజేపీతోనే సమగ్రమైన, సుస్థిరమైన అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర స్వచ్ఛ భారత్ కన్వీనర్ మంచె రాజేశ్ అన్నారు. మండలంలోని శెకెల్ల గ్రామంలో బీజేపీ మండలాధ్యక్షుడు మెడవేణి శ్రీధర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం విద్య,వాణిజ్యం,రక్షణ,ఆర్థిక,సంక్షేమ రంగాల్లో సాధిస్తున్న ప్రగతిని వివరించారు. ప్రతీ కార్యకర్త తమ తమ గ్రామాల్లో మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, నాయకులు మందపెల్లి శ్రీనివాస్,దొనకొండ అనిల్,కేతి రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పారిశుధ్యంపై శిక్షణ

ధర్మపురి: ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్యం –పరిశుభ్రతపై ధర్మపురిలోని బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం శిక్షణ ఇచ్చారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో స్కావెంజర్లకు శిక్షణలిచ్చారు. ఈసందర్భంగా రిసోర్స్ పర్సన్ సంతోష్‌కుమార్, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శ్రీనివాసరెడ్డిలు పరిశుభ్రత నిర్వహణ గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో సీతామహాలక్ష్మి, హెచ్‌ఎంలు,ఆర్పీలు, స్కావెంజర్లు తదితరులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన నర్సింగరావు

కోరుట్ల: రాష్ట్ర నూతన మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వివేక్ వెంకట స్వామీలను కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు గురువారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో కలిసి శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

పుస్తకావిష్కరణ విజయవంతం చేయాలి

కోరుట్ల: ఈ నెల 14న హైదరాబాద్ ఎన్టీఆర్ ఆడిటోరియంలో నిర్వహించే ఓబీసీల పోరుబాట పుస్తక ఆవిష్కరణ కార్యక్రమానికి ఓబీసీ సంఘ నాయకులు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని పద్మశాలీ సంఘ నాయకులు అన్నారు. పట్టణంలోని పద్మశాలీ సంఘ భవనంలో గురువారం పోరుబాట పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఆర్‌పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రుద్ర శ్రీనివాస్, కులోన్నతి సంఘ అధ్యక్షుడు గుంటుక ప్రసాద్, నిర్మాణ కమిటీ చైర్మన్ బోగ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యాధికారిగా జి.అశోక్

రాయికల్: రాయికల్ ఇన్‌చార్జి పశువైద్యాధికారిగా జి.అశోక్ నియమిస్తూ జిల్లా అధికారి వేణుగోపాల్ రావు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ పనిచేసిన శ్రీనివాస్ కరీంనగర్‌లోని ఎఫ్ఎస్‌బీఎస్‌కు బదిలీ కాగా, అశోక్ నియమితులయ్యారు.

దరఖాస్తులు ఆహ్వానం

కథలాపూర్: మండలకేంద్రంలోని కేజీబీవీ బాలికల జూనియర్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ కోర్సుకు బోధించేందుకు గెస్ట్ లెక్చరర్లు దరఖాస్తులు చేసుకోవాలని ప్రత్యేకాధికారి లావణ్య గురువారం తెలిపారు. కంప్యూటర్ సైన్స్ బోధించేందుకు బీఈ, బీ.టెక్, ఎంసీఏ, ఎం.ఎస్సీ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఇంగ్లిష్ సబ్జెక్టు బోధించేందుకు ఎం.ఏ ఇంగ్లీష్‌తోపాటు బీఎడ్ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 16వ తేదీలోగా కథలాపూర్ కేజీబీవీకి నేరుగా వచ్చి దరఖాస్తులు ఇవ్వాలన్నారు.

కథలాపూర్: కథలాపూర్‌లోని కేజీబీవీ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్ట్‌ియర్ కంప్యూటర్ సైన్స్ కోర్సులో చేరడానికి ఆసక్తిగల విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేకాధికారి లావణ్య గురువారం తెలిపారు.

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మోడల్‌స్కూల్, కళాశాలలో బోధించుటకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఇల్లెందుల ప్రభాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో బోధించుటకు మ్యాథ్స్ 2, తెలుగు 1, ఇంగ్లీషు 2, జ్వాలజీ 1, కెమిస్ట్రీ 1, కామర్స్ 1, సివిక్స్ 1 ఖాళీలు ఉన్నాయని ఆయన తెలిపారు. పాఠశాలలో బోధించుటకు హిందీ 2, మ్యాథ్స్ 1, సైన్స్ 1, సోషల్ 1 ఖాళీలు ఉన్నాయని ఆయన తెలిపారు. వివరాలకు సెల్ నంబర్ 7661065301, 8985040725 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

మండలకేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్‌లో చేరేందుకు దరఖాస్తులు చేసుకోవాలని వార్డెన్ నరేందర్ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

మల్లాపూర్: మండల కేంద్రంలోని కేజీబీవీలో కంప్యూటర్ సైన్స్ గెస్ట్ లెక్చరర్ పోస్టు భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ శ్రీలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్హులైన అభ్యర్థులు ఈ నెల 16లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో స్వచ్ఛమైన పంట ఉత్పత్తులు

మల్లాపూర్: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర జీవనానికి ఉపకరించే స్వచ్ఛమైన పంట ఉత్పత్తులు లభిస్తాయని జనవికాస ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ మనీషా, మండల వ్యవసాయ అధికారి లావణ్య అన్నారు. గురువారం మల్లాపూర్ మండలంలోని ముత్యంపేటలో వ్యవసాయశాఖ, జనవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రైతులకు నిర్వహించిన ప్రకృతి వ్యవసాయం అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రకృతి వ్యవసాయం పర్యావరణానికి మేలు చేయడంతో పాటు తక్కువ పెట్టుబడితో రైతులు సాగు చేస్తూ అధిక ఆదాయం పొందవచ్చన్నారు. రసాయనాలు లేకుండా పండించిన పంటలను వినియోగించడం ద్వారా ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుదన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ తక్కల్ల నరేశ్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ మనీషా

పెంచిన బస్‌పాస్ చార్జీలు తగ్గించాలి

మెట్‌పల్లి: పెంచిన బస్‌పాస్ చార్జీలు వెంటనే ప్రభుత్వం విరమించుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. బస్‌పాస్ చార్జీల పెంపు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మెట్‌పల్లి డిపో మేనేజర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే బస్‌పాస్ చార్జీలు ఎక్కువగా ఉన్నాయని గుర్తుచేశారు. బస్‌పాస్ చార్జీల పెంపు నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మారుతి, సాయికుమార్, మున్నా, సూర్య, వెంకీ, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలి

ఇబ్రహీంపట్నం: మండలంలో మిగిలిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కోసం అర్హత ఉన్నవారిని ఎంపిక చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీల ప్రత్యేకాధికారులు,పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. మండలంలోని 17 గ్రామాల్లో 562 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 466 మందికి ఇందిరమ్మ ఇళ్లు ఎంపిక చేసి, ప్రొసీడింగ్ పత్రాలు పంపిణీ చేశారని, ఇంకా 96 ఇళ్లు ఉన్నాయని అలాగే ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కోట కింద 268 ఇండ్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఇళ్లు మంజూరు

బుగ్గారం: మండల కేంద్రంలో రెండేళ్ల క్రితం జరిగిన అగ్ని ప్రమాదంలో ఇళ్లు పూర్తిగా దగ్ధం కావడంతో గ్రామానికి చెందిన బుధారపు లక్ష్మి, బుధారపు కళావతి నిరాశ్రయులైనారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రచారంలో గ్రామానికి వచ్చిన అప్పటి అభ్యర్థి, ప్రస్తుత మంత్రి అడ్లూరి వారికి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మొదటి విడతలోనే తప్పకుండా ఇండ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో మొదటి విడతలో వారికి ఇండ్లు మంజూరు కావడంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు,భాధితులు హర్షం వ్యక్తం చేశారు.

బీజేపీ పట్టణ కార్యవర్గం నియామకం

మెట్‌పల్లి: మెట్‌పల్లి పట్టణ బీజేపీ నూతన కార్యవర్గాన్ని గురువారం నియమించినట్లు పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేశ్ తెలిపారు. ఉపాధ్యక్షులుగా సత్యనారాయణగౌడ్, నగేశ్,రూపేశ్,అనిల్,రమేశ్, గంగాసాగర్,అశోక్, నరేశ్, లావణ్య, ప్రధాన కార్యదర్శులుగా విజయ్,నందకిషోర్, రఘు,రాఘవరెడ్డి, రాకేశ్,నరేష్,హన్మాండ్లు,రాజయ్య,ఆనంద్,నర్సయ్య,లక్ష్మణ్,శ్రీనివాస్,కోశాధికారిగా భాస్కర్, కార్గవర్గ సభ్యులుగా దత్తు, సునీత, రాజు, నరేందర్, నవీన్, శ్రీకాంత్, శ్రీనివాస్, రాజ్‌కుమార్,శ్రావణ్, మల్లేశ్, సురేశ్, చిన్నరాజం,రమేశ్, లక్ష్మీనారాయణ, భూమేశ్, పెద్దరాజంలను నియమించారు.

రాయికల్ పట్టణ కార్యవర్గం

రాయికల్: బీజేపీ పట్టణ కార్యవర్గాన్ని పట్టణ అధ్యక్షుడు కుర్మ మల్లారెడ్డి గురువారం ప్రకటించారు. పట్టణ ప్రధాన కార్యదర్శిగా బన్న సంజీవ్, కూనారపు భూమేశ్, ఉపాధ్యక్షులుగా తోపారపు ఆశన్న, అల్లె నర్సయ్య, ఎల్లగౌడ్, కడార్ల శ్రీనులను నియమించినట్లు తెలిపారు.

విద్యార్థికి అభినందన

జగిత్యాలరూరల్: మండలంలోని జాబితాపూర్‌కు చెందిన పానిశెట్టి సాకేత్ బుధవారం నిజామాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలలో అత్యంత ప్రతిభ కనబర్చి బ్రాంజ్‌మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థిని కోచ్ వంశీకృష్ణ, గ్రామస్తులు అభినందించారు.

విద్యాహక్కు చట్టం అమలు చేయాలి

కథలాపూర్: మండలంలో విద్యాహక్కు చట్టం పక్కాగా అమలు చేయాలని ఎంఈవో శ్రీనివాస్‌కు బీఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం వినతిపత్రం ఇచ్చారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో నిబంధనల ప్రకారం 25 శాతం సీట్లు ఉచితంగా విద్యార్థులకు కేటాయించాలన్నారు. పుస్తకాలు, యూనిఫామ్‌లు ప్రైవేట్ పాఠశాలలు సూచించిన దుకాణాల్లో కొనుగోలు చేయాలని ఒత్తిడి తేవద్దన్నారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ఐ జిల్లా ఇంఛార్జీ నల్ల వర్ధన్, నాయకులు ఎర్రోళ్ల వినీత్, మొలిగే శ్రీకాంత్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి

మల్లాపూర్: మండల అభివృద్ధికి నిధులు కేటాయించాలని బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లో బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, టాయిలెట్ల నిర్మాణానికి ఎమ్మెల్సీ నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు.

నాలుగు పాఠశాలల్లో ప్రీ ప్రైమరీకి అనుమతి

కథలాపూర్: మండలంలోని నాలుగు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీకి ప్రభుత్వం అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మండలంలోని బొమ్మెన, ఊటిపెల్లి, తాండ్ర్యాల, పోసానిపేట గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్నారు. ప్రీ ప్రైమరీ తరగతులకు అనుమతి రావడంతో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు శ్రీనివాస్‌రెడ్డి, రవి, విజయ్, రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు.

మాజీ మంత్రి జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ

పెగడపల్లి/వెల్గటూర్: మాజీ మంత్రి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కొప్పుల ఈశ్వర్ జీవిత చరిత్రను ఒక ప్రస్థానం పేరుతో రచించిన పుస్తకాన్ని గురువారం బీఆర్ఎస్ పార్టీ పెగడపల్లి మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి, వెల్గటూర్ మండల అధ్యక్షుడు చల్లూరి రాంచందర్ ఆధ్వర్యంలో మండల కేంద్రాల్లో ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో మండల ప్రధాన కార్యదర్శులు వెంకన్న,కుమార్ నాయకులు తిరుపతి, భరత్, రాజేశ్, మాజీ ఎంపీపీ శోభారాణి, నాయకులు నరేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ఆనందం, సత్యనారాయణరెడ్డి, రాజిరెడ్డి, కరుణాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు